సామాన్యులపై దౌర్జన్యం చేస్తున్న ఏసీపీ అరుణ్‌కుమార్ (సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం)

ఆక్టోపస్ ఏసీపీపై తిరగబడ్డ జనం!

- పెట్రోల్ బంక్ వద్ద వాహనదారుడితో గొడవ పడ్డ ఏసీపీ అరుణ్‌కుమార్ కొడుకు
- బైక్ తాళం చెవి లాక్కొని తండ్రికి ఫోన్
- వాహనదారుడితోపాటు మరో వ్యక్తిని పోలీస్ వాహనంలో ఎక్కించే ప్రయత్నం
- ఏసీపీ చర్యను అడ్డుకున్న స్థానికులు

మేడ్చల్, నవంబర్ 23: పెట్రోల్ బంక్ వద్ద ఒక సామాన్యుడితో అతిగా వ్యవహరించిన ఆక్టోపస్ ఏసీపీ అరుణ్‌కుమార్‌పై స్థానికులు తిరగబడ్డారు. రాచకొండ కమిషనరేట్ మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి చెంగిచెర్లలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో లక్ష్మీ నారాయణ అనే వ్యక్తి తన బైక్‌లో పెట్రోల్ పోయించుకుని వెళ్తుండగా, ఆ వెనుక ఉన్న ఆక్టోపస్ ఏసీపీ అరుణ్‌కుమార్ కుమారుడి వాహనానికి తగిలింది. దీంతో ఏసీపీ కొడుకు కోపోద్రిక్తుడయ్యాడు. లక్ష్మీనారాయణతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో మరింత అసహనానికి గురైన ఏసీపీ కొడుకు లక్ష్మీనారాయణ బైక్‌కు ఉన్న తాళం తీసుకొని, తన తండ్రి అరుణ్‌కుమార్‌కి ఫోన్ చేశాడు. పోలీస్ వాహనంలో అక్కడకు చేరుకున్న ఏసీపీ అరుణ్‌కుమార్ వస్తూనే తిట్ల దండకం అందుకున్నారు. లక్ష్మీనారాయణతోపాటు అడ్డుగా వచ్చిన మరో వ్యక్తి గల్లా పట్టుకొని పోలీస్ వాహనంలోకి ఎక్కించే ప్రయత్నం చేయగా స్థానికులు ఎదురు తిరిగారు. బాధ్యత గల పోలీస్ అధికారి సామాన్యులపై జులుం చూపించడం ఏమిటని ప్రశ్నించడంతో ఆయన కొంత వెనక్కి తగ్గారు. ఈ దృశ్యాలు పెట్రోల్‌బంక్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. అనంతరం ఏసీపీ తీరుపై బాధితులు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు సమాచారం.

లగచర్ల ఘటనకు కాంగ్రెసోళ్లే బాధ్యులు

- అందులో 12 మంది ఆ పార్టీ నాయకులే..
- బీఆర్ఎస్ ప్రోద్బలంతోనే అన్నది కట్టుకథ
- బీఆర్ఎస్ నాయకుడు శుభప్రద్ పటేల్

తాండూరు, నవంబర్ 23 : లగచర్ల ఘటనకు కాంగ్రెసోళ్లే బాధ్యులని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. ఈ ఘటనలో 12 మంది అధికార పార్టీ నాయకులే ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రోద్బలంతోనే ఈ ఘటన జరిగినట్టు ప్రభుత్వం కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. శనివారం ఆయన వికారాబాద్ జిల్లా తాండూరులో మీడియాతో మాట్లాడారు. ఫార్మా విలేజ్‌లంటూ దుద్యాల మండలంలో భూములు సేకరించడం దారుణమని అన్నారు. లగచర్ల, హకీంపేట్, పోలపల్లి, రోటిబండ తండా, పులిచెర్ల తండాలకు సంబంధించి పెద్ద ఎత్తున భూములను సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని అన్నారు. తాము భూములు ఇవ్వలేమని స్థానిక రైతులు ఎన్నోసార్లు అధికారులతో మొరపెట్టుకున్నా, ధర్నాలు, పాదయాత్రలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే రైతులు తిరగబడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో 3 కేసులను నమోదు కాగా అందులో ఒక్క కేసులోనే 46 మందిని నిందితులుగా పేర్కొన్నారని తెలిపారు. ఇందులో 12 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కూడా ఉన్నట్టు చెప్పారు. మీడియా సాక్షిగా అందులో సీఎం రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డితో సన్నిహితంగా ఉన్న రామూనాయక్, నాగుల హన్మంతు ఇలాచాలా మందిని గుర్తించినట్టు తెలిపారు. అయినప్పటికి వారిని ఇప్పటివరకు అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. 46 మంది నిందితుల్లో బీజేపీ వారు కూడా ఉన్నట్టు తెలిపారు. ఒక్క సురేశ్ అనే వ్యక్తిని చూపించి మొత్తం బీఆర్ఎస్ పార్టీ కుట్ర పన్నిందని చెప్పడం సమంజసం కాదని అన్నారు.

యూనిఫామ్‌లో రెచ్చిపోతరా!

- భయాందోళనకు గురిచేయొద్దు
- బాధితులు భయపడొద్దు
- ఎన్‌హెచ్ఆర్సీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ లా ముకేశ్ భరోసా
- లగచర్ల, రోటిబండతండాలో పర్యటన
- ఫార్మా బాధితుల వివరాల సేకరణ
- ఎన్‌హెచ్ఆర్సీ సభ్యుల ముందు గోడు చెప్పుకున్న ఫార్మా బాధితులు

రిజిస్ట్రార్‌కు తమ గోడు వెళ్లబోసుకునేందుకు గుంపులుగా వెళ్తున్న రోటిబండ తండా వాసులు

కొడంగల్, నవంబర్ 23 : 'బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం. ఎవరూ భయపడొద్దు. స్వేచ్ఛగా జీవించాలి' అని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ లా ముకేశ్ భరోసా ఇచ్చారు. భూసేకరణ ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే జరుగుతుందని, ఎవరూ భయపడొద్దని భరోసా ఇచ్చారు. యూనిఫామ్ ఉన్నదని ప్రజలపై అధికారాన్ని చలాయించొద్దని, వారిని భయాందోళనకు గురిచేయొద్దని పోలీసులకు సూచించారు. ఇకనుంచి పోలీసులు గ్రామాలకు రారని చెప్పారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం రోటిబండతండాలో శనివారం ఆయన బాధిత కుటుంబాలను కలిశారు. ఈ నెల 11న జరిగిన ఘటన, అనంతర పరిణామాలు, ప్రస్తుత పరిస్థితులను అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. లగచర్ల ఘటనపై బాధిత కుటుంబాలు, రైతుల ఫిర్యాదు మేరకు తాము ఢిల్లీ నుంచి వచ్చినట్టు తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. బాధితుల నుంచి సేకరించిన వివరాలను ప్రభుత్వ దృష్టికి తీకెళ్తామని చెప్పారు. ఆయన వెంట ఎన్‌హెచ్ఆర్సీ ఇన్‌స్పెక్టర్లు రోహిత్ సింగ్, యతీప్రకాశ్‌శర్మ ఉన్నారు. అధికారులపై దాడిలో నిందితులుగా ఉన్నవారు పోలీసులకు లొంగిపోతే అందరికీ బెయిల్ మంజూరయ్యే అవకాశం ఉంటుందని సూచించారు.

బిక్కుబిక్కుమంటూ భయంతో ఉంటున్నం

'పోలీసులు మగవారు లేని ఇండ్లలోకి చొరబడి మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించారు. కరెంటు తీసేసి ఊరులోపలికి వచ్చి దాడి చేశారు. మా భర్తలు, కొడుకులు ఆ రోజు నుంచి కనిపించడం లేదు. వారు కనిపిస్తలేరని పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే మమ్మల్ని కూడా అరెస్టు చేస్తరేమోనని భయమైతున్నది. అప్పటినుంచి బిక్కుబిక్కుమనుకుంట తండాలల్లనే బతుకుతున్నం. 12 రోజుల నుంచి భయంభయంతోనే కాలం ఎల్లదీస్తున్నం. ఎప్పుడు ఎవరు వస్తరో.. ఏం జరుగుతదో తెల్వక తిండి, నిద్ర లేకుండ పాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నం. పొలాలకు పోతలేము. వరి, కంది పంటలు చేతికొచ్చినయి. వాటిని కోయకుంటే గింజలు నేల రాలుతయ్' అంటూ లగచర్ల, దాని చుట్టుపక్కల తండాల ప్రజలు ఎన్‌హెచ్ఆర్సీ సభ్యుల ముందు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నెల 11న అర్ధరాత్రి పోలీసులు సృష్టించిన బీభత్సంపై విచారణ జరిపేందుకు ఎన్‌హెచ్ఆర్సీ బృందం శనివారం రోటిబండ తండాను సందర్శించింది. లగచర్లకు చెందిన ఫార్మా బాధిత రైతులు ఇటీవల ఢిల్లీ వెళ్లి తమకు న్యాయం చేయాలని ఎన్‌హెచ్ఆర్సీని కోరిన సంగతి తెలిసిందే.

వచ్చింది కలెక్టర్ అని తెల్వదు

ఈ నెల 11న ఉదయం దుద్యాల మండలంలోని హకీంపేట-దుద్యాల గ్రామాల మధ్యలో అధికారులు ఫార్మావిలేజ్ ఏర్పాటులో భాగంగా భూసేకరణ కోసం మీటింగ్ ఏర్పాటు చేశారని.. తమకు భూములిచ్చే ఉద్దేశం లేకపోవడంతో రైతులందరం లగచర్ల గ్రామంలోనే ఉన్నామని బాధితులు ఎన్‌హెచ్ఆర్సీ బృందంతో చెప్పారు. కాగా కలెక్టర్ ఎటువంటి సమాచారం లేకుండా లగచర్లకు వచ్చారని, తామంతా ఫార్మా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశామని తెలిపారు. వచ్చింది కలెక్టర్ అని తమకు తెలియదని, అధికారులు కావొచ్చని వారితో మాట్లాడుతున్న క్రమంలో తోపులాట జరిగిందని వివరించారు. ఇది కావాలని చేసింది కాదని చెప్పారు. కానీ ఆ ఘటనను కావాలనే దాడిగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన రోజు తీసిన వీడియోల ఆధారంగా 300 మంది పోలీసులు అర్ధరాత్రి లైట్లు తీసేసి రోటిబండతండాలో ఉన్న పురుషులను వ్యాన్లలో ఎక్కించారని.. మగవారు లేని ఇండ్లలో మహిళలతో దురుసుగా ప్రవర్తించారని, ఫార్మావిలేజ్‌కి భూములిచ్చే ప్రసక్తి లేదని వారు స్పష్టంచేశారు.

అందరూ లొంగిపోతేనే బెయిల్: పోలీసులు

దాడిలో తాము పేర్కొన్న నిందితుల్లో కొంత మంది పరారీలో ఉన్నారని, వారందరూ వచ్చి స్వచ్ఛందంగా పోలీసుల ముందు కానీ, కోర్టులో గానీ లొంగిపోతే అందరికీ బెయిల్ వచ్చే అవకాశం ఉంటుందని పోలీసులు తండాల్లోని మహిళలకు అవగాహన కల్పించారు. జాబితాలో ఉన్న వారంతా లొంగిపోతేనే అరెస్టయిన వారికి కూడా బెయిల్ మంజూరు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బెయిల్ మంజూరుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి కోర్టులో ఫ్రీ లీగల్ సర్వీసెస్ విభాగం ఉంటుందని, దానిని ఆశ్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, డీటీడబ్ల్యూ కమాలాకర్‌రెడ్డి, దుద్యాల తాసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

బ్యాంకులు రుణాలివ్వడం లేదు

ప్రస్తుతం ఈ ప్రాంతంలో రూ.70లక్షల నుంచి కోటి వరకు భూముల ధరలు పలుకుతున్నాయని, ప్రభుత్వం ఇచ్చే రూ.20 లక్షలతో మరో చోట భూమి కొనే పరిస్థితి లేదని బాధితులు చెప్పారు. ఫార్మా కోసం భూ సేకరణ జరుగుతుందని తమకు తెలియదని అన్నారు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదని.. ఎందుకని అడిగితే ఫార్మా కంపెనీల ఏర్పాటుతో తమ భూములు పోతున్నందున వాటికి రుణాలు ఇవ్వడం కుదరదని చెప్పారని తెలిపారు. అప్పటివరకు ఇక్కడ ఫార్మా కంపెనీ వస్తుందని, తమ భూములు ఇవ్వాల్సి వస్తుందని గ్రహించలేదని అన్నారు.

లగచర్లలో రేపు ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన

సంగారెడ్డి జైలులో బాధితులను కలువనున్న బృందం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బృందం సోమవారం లగచర్లలో పర్యటించనున్నది. కలెక్టర్‌పై దాడి జరిగిందనే నెపంతో పోలీసులు తమపై దాడులు చేసి అక్రమంగా అరెస్టులు చేశారని, లగచర్ల బాధితులు ఇటీవల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన చైర్మన్ బక్కి వెంకటయ్య.. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు జారీ చేశారు. కమిషన్ బృందం సోమవారం లగచర్లలో పర్యటించి దళిత, గిరిజనుల భూముల బలవంత సేకరణ, పోలీసుల వేధింపులను బాధితులను స్వయంగా అడిగి తెలుసుకోనున్నది. అనంతరం సంగారెడ్డి జిల్లా జైలుకు వెళ్లి బాధితులను కలవనున్నది.

లగచర్ల దాడికి తిరుపతిరెడ్డి సూత్రధారి!

- లగచర్ల దాడికి తిరుపతిరెడ్డి సూత్రధారి
- మా భూములు లాక్కుంటే సహించం
- త్వరలో చలో హైదరాబాద్‌కు పిలుపు
- రైతులపై కేసులు వెనక్కి తీసుకోవాలి
- బంజారా, పౌరహక్కుల నేతల డిమాండ్

సీఎం సోదరుడిపై కేసు పెట్టాలి

2024 జూలై నుంచే 6 తండాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. 300 మంది పోలీసుల పహారాలో 2 కిలోమీటర్ల పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. జనం హాజరుకాకపోయినా కలెక్టర్ అత్యుత్సాహం చూపారు. దాడి జరగలేదని కలెక్టర్ చెప్పినా రైతులను పోలీసులు కేసుల్లో ఇరికించారు. లగచర్ల ఘటన కుట్రకు కారణమైన రేవంత్ సోదరుడు తిరుపతిరెడిపై కేసు పెట్టాలి.

– సంజీవ్ నాయక్, సేవాలాల్ సేన జాతీయాధ్యక్షుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): ఫార్మా కంపెనీల కోసం లంబాడీల భూములు లాక్కోవడమే లక్ష్యంగా జరిగిన లగచర్ల కుట్రకు అసలైన సూత్రధారి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డేనని బంజారా సంఘాల నేతలు ఆరోపించారు. కుట్రకు కారకులను వదిలిపెట్టి, రైతులపై కేసులు పెట్టారని మండిపడ్డారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జరిగిన 'లగచర్లలో ప్రభుత్వ నిర్బంధం-భవిష్యత్ కార్యాచరణ''పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో బంజారా, పౌర హక్కులు, విద్యార్థి, న్యాయవాద సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. 15 రోజుల తర్వాత చలో హైదరాబాద్ నిర్వహిస్తామని చెప్పారు. సమావేశం లో ప్రొఫెసర్ లక్ష్మణ్, ఓయూ విద్యార్థి నేత నెహ్రూ నాయక్, ఆలిండియా బంజారా సంఘం ప్రతినిధులు విష్ణునాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

లంబాడీలకు లడాయి కొత్తకాదు

మా భూముల జోలికి వస్తే దేనికైనా తెగిస్తాం. చావనైనా చస్తాం కానీ, ఫార్మాకు భూములు ఇచ్చేది లేదు. దౌర్జన్యం చేస్తే తిరుగుబాటు జెండాను ఎగరేస్తాం. మా భూములు లాక్కుని రేవంత్‌రెడ్డి అల్లుడికి కట్నంగా ఇవ్వాలని చూస్తున్నారు.

– భీమానాయక్, లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

అభివృద్ధి పేరిట విధ్వంసం

ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ విధ్వంసానికి తెరలేపారు. అణచివేతలతో లంబాడీలను ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తున్నది. ప్రభుత్వం చేస్తున్న విధ్వంసంతో తండాలు మనుగడ కోల్పోతాయి. ఎకరం భూమికి రూ.60 లక్షలు ఉంటే.. రూ.10 లక్షలే చెల్లిస్తామనడం అన్యాయం. భూసేకరణ చట్టం-2013 ప్రకారం పరిహారం చెల్లించాలి.

–నారాయణరావు, పౌరహక్కుల సంఘం నాయకుడు

చర్లపల్లి జైలులో పట్నం నరేందర్‌రెడ్డిని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఉప్పల్ ఎమ్మెల్యే బీ లక్ష్మారెడ్డి తదితరులు

రేవంత్ పాపాలను ప్రజలు లెక్కిస్తున్నరు

మొదటిపేజీ తరువాయి...

మండిపడ్డారు. ఆయన జైల్లో శిక్ష అనుభవిస్తున్నా.. ఆయన తన ప్రజల కోసమే ఆలోచిస్తున్నాడని కేటీఆర్ చెప్పారు. 'అన్నా నా గురించి ఆలోచించొద్దు. నేను ఎలా ఉన్నా పర్లేదు. చేయని తప్పునకు 30 మంది అమాయక పేద రైతులను జైల్లో పెట్టారు. వాళ్లను విడిపించండి. వాళ్లకోసం పోరాటం చేయండి. మా కొడంగల్ రైతుల పక్షాన నిలబడండి. కొడంగల్ గిరిజనుల పక్షాన కొట్లాడండి. అక్కర్లేని ఫార్మా విలేజీని మా కొడంగల్ ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం రుద్దుతున్నది అని నాతో చెప్పి బాధపడ్డడు' అని కేటీఆర్ వివరించారు. జైల్లో ఉన్నా నరేందర్‌రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నారని.. మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ చేపట్టనున్న ధర్నాను విజయవంతంగా చేయాలని తమకు ఉత్సాహాన్నిచ్చారని కేటీఆర్ వివరించారు.

బందిపోట్లుగా మీద పడ్డరు

'సంగారెడ్డి జైలు నుంచి మొదలుపెడితే చర్లపల్లి జైలు వరకు అమాయకులు జైల్లో ఉంటే కొడంగల్ నుంచి కొండారెడ్డిపల్లి వరకు అరాచకాలు చేస్తున్న దుర్మార్గులు గద్దెనెక్కి కూర్చున్నారు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొడంగల్‌లో పేద రైతులపై బందిపోట్ల మాదిరిగా మీదపడి వారి భూములను కాంగ్రెస్ నాయకులు గుంజుకుంటున్నారని ధ్వజమెత్తారు. తమ భూములు ఇచ్చేదిలేదని రైతులు చెప్తే అర్ధరాత్రి చిన్న పిల్లలు, ముసలివాళ్లు, ఆడవాళ్లని కూడా చూడకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ అరాచకం సాగించిందని విమర్శించారు. 'కొండారెడ్డిపల్లి రేవంత్‌రెడ్డి సొంత ఊరు. అక్కడ ఓ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి. ఆయనకు 85 ఏండ్లు. ఇదే రేవంత్‌రెడ్డి కోసం ఎన్నికల్లో పనిచేసిండు. ఓట్లు వేయించిండు. అట్లాంటి పెద్దాయన మీద కూడ పగబట్టి ఆయన ఇంటికి అడ్డంగా గోడ కట్టి తొవ్వలేకుండా చేస్తే ఆ క్షోభ భరించలేక సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు.. నియంతల పాలన, దుర్మార్గుల పాలనలోనే ఇలాంటి ఆంక్షలు, వేధింపులు ఉంటయి' అని మండిపడ్డారు. 'మేము కూడా పదేండ్లు ప్రభుత్వంలో ఉన్నం.. ఇలాంటి వార్తలు ఎప్పుడైనా విన్నారా? ఇండ్లకు అడ్డంగా గోడలు కట్టే సంఘటనలు జరిగినయా?' అని ప్రశ్నించారు.

> కొడంగల్ నుంచి కొండారెడ్డిపల్లి వరకు అరాచకాలు చేస్తున్న దుర్మార్గులు గద్దెనెక్కి కూర్చున్నరు. అధికారం ఉన్నది కదా అని విచ్చలవిడిగా దౌర్జన్యం చేస్తూ సాయిరెడ్డి, గురువారెడ్డి లాంటి వ్యక్తుల ఆత్మహత్యలకు కారణమైండ్రు. వారి అరాచకాలు, పాపాలు పండే రోజు దగ్గర్లోనే ఉన్నది.
> -కేటీఆర్

రైతు కుటుంబాలకు అండగా కేసీఆర్

'జైల్లో మగ్గుతున్న రైతులు, వారి కుటుంబాలు భయపడాల్సిన అవసరం లేదు.. మీ వెనకాల కేసీఆర్ ఉంటారు' అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులకు తప్పక న్యాయం జరుగుతుందని, న్యాయస్థానంలో న్యాయమే గెలుస్తుందని చెప్పారు. 'నాలుగు రోజులు రేవంత్‌రెడ్డి జైల్లో పెడ్తాడేమోగాని భవిష్యత్తులో రేవంత్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు కూడా లేకుండా గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది' అని సూచించారు. ములాఖత్‌లో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ హలీ, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే లక్ష్మణ్ రెడ్డి ఉన్నారు.

> పేద, గిరిజన, బలహీనవర్గాల రైతుల తరపున పోరాటం చేసిన పాపానికి నరేందర్‌రెడ్డిని ఈ ప్రభుత్వం జైల్లో వేసింది. జైల్లో శిక్ష అనుభవిస్తున్నా తన ప్రజల కోసమే ఆలోచిస్తున్నాడు. చేయని తప్పునకు 30 మంది అమాయక పేద రైతులను జైల్లో పెట్టారు. వాళ్లను విడిపించండి.. వాళ్ల కోసం పోరాటం చేయండని నరేందర్‌రెడ్డి కోరుకున్నడు. పట్నం నరేందర్‌రెడ్డికి మనస్ఫూర్తిగా అభినందనలు.
> -కేటీఆర్

ఫార్మా విలేజ్ కాదు.. పారిశ్రామిక కారిడార్!

మొదటిపేజీ తరువాయి...



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నేతలు తమ్మినేని, కూనంనేని, జూలకంటి

పెంపు అంశాన్ని పరిశీలిస్తామని శనివారం వామపక్ష పార్టీల ప్రతినిధుల బృందానికి సీఎం భరోసా ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ముచ్చర్లలో ప్రతిపాదిత ఫార్మా సిటీని రద్దుచేస్తున్నామని, రాష్ట్రంలో పది ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. మొదటి దశలో మెదక్, వికారాబాద్, నల్లగొండలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని సీఎం స్పష్టంచేశారు. అయితే, ఈ మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో లేవని, ప్రైవేటుగా రైతుల నుంచి భూసేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు తేల్చిచెప్పారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మావిలేజీని ఏర్పాటుచేయాలని సీఎం పట్టుదలగా ఉండటంతో అధికారులు ఫార్మా పరిశ్రమల కోసం నోటిఫికేషన్ జారీచేసి భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రాంతంలో తన అల్లుడికి చెందిన ఫార్మా పరిశ్రమను ఏర్పాటుచేయాలనే ఉద్దేశంతోనే సీఎం ఇంత పట్టుదల చూపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో లగచర్లలో అధికారులు భూసేకరణకు చర్యలు ప్రారంభించగా, రైతులు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారు. తమ భూములను ఫార్మాసిటీకి ఇచ్చేది లేదంటూ ఆందోళనకు దిగారు. లగచర్ల ఘటనలో పోలీసులు అర్ధరాత్రి దళితులు, గిరిజనులు, మహిళలపై దాడికి పాల్పడటం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రభుత్వం ఈ ఏడాది 19న విడుదల చేసిన గెజిట్‌లో మాత్రం ఫార్మావిలేజీగా స్పష్టంగా పేర్కొన్నది. కొత్త గెజిట్ విడుదల చేయకుండా నోటిమాటగా సీఎం మాటమార్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో భూములు సేకరించి, తర్వాత ఫార్మా పరిశ్రమలు ఏర్పాటుచేసే కుట్ర జరుగుతున్నదని రైతులు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి.

భూసేకరణ తప్పదా?

ఫార్మాసిటీ అయినా, ఇండస్ట్రియల్ కారిడార్‌ను అయినా భూసేకరణ చేయకుండా ఏర్పాటు చేసే అవకాశం లేదు. ఒకవేళ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉంటే తప్ప రైతుల నుంచి భూసేకరణ చేయకుండా పరిశ్రమల స్థాపనకు అవకాశమే లేదని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. ఫార్మాసిటీకి సరిపడా ప్రభుత్వ భూమి అందుబాటులో లేనందునే అధికారులు భూసేకరణకు తెరలేపారు. కొడంగల్‌లో దొరల సీలింగ్ భూములు 1,156 ఎకరాలు పడావుగా ఉన్నాయని, వాటిని పరిశ్రమల కోసం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని వామపక్షాలు సీఎంకు సూచించాయి. కాగా, సీఎం మాత్రం భూసేకరణకు నష్ట పరిహారం పెంచే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పడం గమనార్హం. దీనినిబట్టి పరిశ్రమల కారిడార్ కోసం సీఎం భూసేకరణ చేయించేందుకే పట్టుదలగా ఉన్నట్టు స్పష్టమవుతున్నది. వామపక్షాలు సూచిస్తున్నట్టుగా ప్రభుత్వం సీలింగ్ భూములను తీసుకుంటుందా? రైతుల నుంచి భూములను సేకరించేందుకు మొగ్గు చూపుతుందా? అనేది రానున్నరోజుల్లో తేలిపోతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ముచ్చర్ల ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్టు సీఎం ప్రకటించడం కాంగ్రెస్ సర్కారుకు తలపోటుగా మారింది. ఆ భూముల్లోనే ఫార్మా సిటీని యథాప్రకారం అమలుచేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదికాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఫార్మాసిటీ కోసమే అంటున్న అధికారులు

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నేతృత్వంలోని పది వామపక్ష పార్టీలతో కూడిన ప్రతినిధి బృందం లగచర్లలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమైంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. లగచర్ల పరిధిలో ఏర్పాటుచేస్తున్నది ఫార్మాసిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని పేర్కొన్నారు. వాస్తవానికి అధికారులు సైతం ఫార్మాసిటీ కోసమే భూసేకరణ చేపడుతున్నట్టు చెప్తూవచ్చారు. ఊహించని విధంగా రైతులనుంచి తిరుగుబాటు రావడంతో సీఎం దిగిరాక తప్పలేదు.

అబద్ధాలకోరు రేవంత్‌రెడ్డి: కొణతం దిలీప్

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): లగచర్ల భూసేకరణపై మాట మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. పచ్చి అబద్ధాల కోరు అని డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. అబద్ధానికి అంగీ, లాగు వేస్తే అది సీఎం రేవంత్‌రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చిందే ఫార్మా విలేజ్ కోసమని... ఇప్పుడు కాదని బొంకుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

లోకం పోకడ

గంతలు ఎందుకు విప్పారు?
ఈ ఘోరాలు చూడలేకపోతున్నా!

పోలీస్ ఫంక్షనల్ వర్టికల్స్‌కు తిలోదకాలు

డీజీపీ స్థాయిలోనే సమీక్షలు కరువు

పోలీసుల్లోనూ తగ్గిన జవాబుదారీతనం

అదుపుతప్పుతున్నలా అండ్ ఆర్డర్‌కు ఇదో కారణం

> హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కిరణ్, వరంగల్ పట్టణానికి చెందిన తన స్నేహితుడి అవసరం కోసం రూ.60 వేలు చేబదులుగా ఇచ్చాడు. అవి తిరిగి ఇవ్వకపోవడంతో వరంగల్ పోలీసు కమిషరేట్‌లోని ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు కాకుండా, కిరణ్ స్నేహితుడిని పిలిచి స్టేషన్‌లోనే డబ్బులిచ్చేలా సెటిల్ చేసిన పోలీసులు.. తెల్లకాగితంపై సంతకాలు చేయించి, దాని సంగతి మర్చిపోయారు. ఇదే విషయమై కేసు పెట్టమని కిరణ్ వెళ్లి అడిగినా, నిందితుడికి కాల్ చేసినా ఎవరూ స్పందించడం లేదు. ఆ వ్యవహారం ఎం